

చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. దివ్యాంగ చిన్నారులు సంతోషంగా క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.1°/ 19.4°

జిల్లా అంతటా గురువారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై చాలా మండలాల్లో మోస్తరుగా వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా టాస్క్‌ఫోర్స్

- సభ్యులుగా కేతిరెడ్డి, రమేష్‌గౌడ్





కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, రమేష్ గౌడ్

అనంతపురం కార్పొరేషన్: అక్రమ నిర్బంధాలు, అరెస్టులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉండేలా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో టాస్క్‌ఫోర్స్ సభ్యులుగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్‌ను నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం అందించడంతో పాటు బాధితులను పరామర్శిస్తూ ఆత్మస్థైర్యం నింపాలని సభ్యులకు వైఎస్ జగన్ సూచించారు. పార్టీ నాయకులు, లీగల్ సెల్ ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

ఎస్కేయూలో 'ఎన్‌ఐఆర్‌ఎఫ్' బృందం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని గురువారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) కమిటీ సందర్శించింది. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ బి.అనితతో కమిటీ సభ్యులు ప్రొఫెసర్ బి. రాజశేఖర్, ప్రొఫెసర్ పీయూష్‌కాంతి పాణిగ్రాహి, ప్రొఫెసర్ సంజయ్ ధోలే సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కాగా, ఐదు అంశాల ఆధారంగా వర్సిటీ పురోగతిని కమిటీ సభ్యులు అంచనా వేస్తారు. బోధన.. అభ్యసన (30 శాతం), పరిశోధన (30 శాతం), ఔట్‌రీచ్ (10 శాతం), గ్రాడ్యుయేషన్ ఫలితాలు (20 శాతం), అవగాహన (10 శాతం) అంశాల ఆధారంగా ర్యాంకు కేటాయిస్తారు.

బొమ్మనహాళ్, వజ్రకరూరు ఎంపీడీఓలకు షోకాజ్

అనంతపురం సిటీ: బొమ్మనహాళ్ ఎంపీడీఓ దాసా నాయక్, వజ్రకరూరు ఎంపీడీఓ రవి ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు పంపినట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యాంశాల పురోగతిలో వెనుకబడటంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించామని, లేకుంటే కలెక్టర్ నిర్ణయం మేరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

కణేకల్లు ఎంపీడీఓపై సీరియస్..

కణేకల్లు ఎంపీడీఓ శ్రీనివాసులుపై కూడా కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. అభివృద్ధి పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్షకు శ్రీనివాసులు నుంచి కనీస స్పందన లేకపోవడంతో చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓకు సూచించినట్లు సమాచారం.

సాకులు.. ముప్పతిప్పలు

- కృష్ణాపురానికి చెందిన సూర్యనారాయణ భూ సమస్య పరిష్కారం కోసం గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగారు. అధికారులు పరిష్కారం మాత్రం చూపలేదు. అనంతపురం కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించినా అక్కడా తగిన స్పందన లేకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన పురుగుల మందు తాగి ఇటీవల మరణించారు.
- అనంతపురం నగరంలోని పాతూరుకు చెందిన ఒక యువకుడు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేశారు. వాస్తవానికి రికార్డులు పరిశీలించి వారం రోజుల్లో సర్టిఫికెట్ మంజూరు చేయాలి. కానీ 28 రోజులు దాటినా ఇంతవరకూ యువకుడికి సర్టిఫికెట్ అందించలేదు.
- కళ్యాణదుర్గం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి, సోదరులకు మధ్య భూ సమస్య ఉంది. తన భూమిని దాయాదులు ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. దీనిపై బాధితుడు తహసీల్దార్‌ను ఆశ్రయించగా ఆయన చేతులెత్తేశారు. ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నారని, తాను ఏమీ చేయలేనని కరాఖండీగా చెప్పేశారు. పైగా బాధితుడిని డీఎస్పీ బెదిరించి ఇక ఫిర్యాదు చేయనంటూ పత్రం రాయించుకున్నట్లు తెలిసింది.



- రెవెన్యూ అధికారుల అలసత్వం
- ఒక్క ఈ శాఖలోనే 28 వేలకు పైగా అర్జీలు పెండింగ్
- ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌కూ నెలరోజులకు పైగా నిరీక్షణ
- మండలస్థాయిలో పరిష్కారం దొరక్క కలెక్టరేట్‌కు వస్తున్న బాధితులు
- వినతులను పట్టించుకోని తహసీల్దార్లు
- అనంతపురం రూరల్ తహసీల్దార్‌పై ఫిర్యాదుల వెల్లువ
- కలెక్టర్, జేసీ ఆదేశాలు సైతం బేఖాతరు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా సామాన్యులు అల్లాడిపోతున్నారు. చిన్న చిన్న సమస్యలకూ తహసీల్దార్ కార్యాలయాల్లో పరిష్కారం లభించడం లేదు. వీఆర్‌ఓ, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ ఇలా వివిధ దశల్లో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారు. సామాన్యులకు కనీస మర్యాద కూడా ఇవ్వకుండా కసురుకుంటున్నారు. ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరిగినా పరిష్కారం లభించకపోవడంతో మనస్తాపం చెందుతున్న కొందరు ఆత్మహత్యల వరకూ వెళ్తున్నారు. అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నట్టు సామాన్యులు వాపోతున్నారు. తహసీల్దార్ మోహన్‌కుమార్ దారుణంగా వ్యవహరిస్తారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

సర్టిఫికెట్ల కోసం అవస్థలు..

రెండు, మూడు మాసాల్లో పోటీ పరీక్షలు మొదలు కానున్నాయి.దీంతో ఆదాయ ధ్రువీకరణ,ఈడబ్ల్యూఎస్, కుల ధ్రువీకరణ తదితర పత్రాల కోసం యువత తహసీల్దార్ కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. కానీ అక్కడేమో సిబ్బంది లేరని, సర్వర్ పనిచేయడం లేదని, మీటింగ్‌లో ఉన్నామని తదితర కారణాలతో తిప్పుకుంటుండటంతో బాధితులు విసిగిపోతున్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలంటే 'తల కింద పెట్టి తపస్సు చేయాల్సినంతగా' అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా జాప్యం జరుగుతోందని బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

కలెక్టరేట్‌కు దరఖాస్తుల వెల్లువ

జిల్లాలో 31 మండలాల ఉన్నాయి. సమస్యల పరిష్కార నిమిత్తం మండల కార్యాలయాలకు సామాన్యులు వెళుతుంటే అక్కడ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతి సోమవారం జిల్లాకేంద్రంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి బాధితులు పోటెత్తుతున్నారు. జిల్లా అధికారులు అర్జీలపై సంతకాలు చేసి పంపితేకానీ తహసీల్దార్లు స్పందించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో వివిధ విభాగాల్లో పెండింగ్ దరఖాస్తులు ఇలా

కేటగిరీ	పెండింగ్ దరఖాస్తులు
రెవెన్యూ	28,500
విద్యుత్	7,856
మున్సిపాలిటీ	4,644
అగ్రికల్చర్	2,108
పంచాయతీరాజ్	9,604

అలసత్వాన్ని సహించేది లేదు



ఎస్‌ఎల్‌ఏ (సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్) ప్రకారం ఉన్న ప్రతి దరఖాస్తును వెంటనే పరిష్కరించాలి. దీనిపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటాం. పెండింగ్ దరఖాస్తులపై జేసీ, నేను సిబ్బందితో సమీక్షించి ఆదేశాలు ఇస్తాం.

–వినోద్‌కుమార్, కలెక్టర్

దారుణంగా పరిస్థితులు



కూడేరు మండలం ఇప్పేరు గ్రామంలో ఉన్న నా పొలం సర్వే నం 547–2ఏకు ఎన్‌ఓసీ కోసం రెండేళ్ల క్రితం దరఖాస్తు చేశాను. ఇప్పటివరకూ తిప్పుతూనే ఉన్నారు. ఫైలు ఎక్కడుందో కూడా తెలియడం లేదు. తహసీల్దార్ దగ్గరకు వెళితే ఆర్డీవో ఆఫీస్‌లో ఉందంటారు, అక్కడకు వెళితే తహసీల్దార్ దగ్గర ఉందంటున్నారు. నా పరిస్థితి దారుణంగా ఉంది.

–బండి సంగప్ప, రైతు, ఇప్పేరు, కూడేరు మండలం

భూసమస్యలు టైం తీసుకుంటాయి



దరఖాస్తులు ఎక్కువగా భూ వివాదాలపైనే ఉంటున్నాయి. వీటి పరిష్కారానికి సమయం పడుతుంది. సామాన్యులు సమస్యలపై వస్తే స్పందిస్తున్నాం. అర్జీదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆర్‌ఐలు, వీఆర్‌ఓలను కూడా ఆదేశించాం. ఎవరైనా మర్యాదగా ప్రవర్తించకపోతే చర్యలు తీసుకుంటాం.

– బ్రహ్మయ్య, తహసీల్దార్, శింగనమల

సమస్యలు పరిష్కరిస్తున్నాం



రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 51 అర్జీలు రాగా, 42 పరిష్కరించాం. 9 అర్జీలు కోర్టులో ఉన్నాయి. భూసమస్యలు, వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కారం చూపుతున్నాం. రీసర్వేపై 149 అర్జీలు వచ్చాయి. వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తాం.

– మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

డైరెక్ట్‌గా ఆన్సర్ ఇవ్వండి మేడం..!

- భూసార పరీక్షలపై కలెక్టర్ ప్రశ్న
- నీళ్లు నమిలిన ఏడీఏ, జేడీఏలు



భూసార పరీక్షల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: 'అమ్మా... మేడం మీరు డైరెక్ట్‌గా ఆన్సర్ ఇవ్వడం లేదు' అంటూ ఏడీఏ రోజాపుష్పలతకు కలెక్టర్ వినోద్‌కుమార్ చురక అంటించారు. అనంతపురం ఆదిమూర్తినగర్‌లో ఉన్న భూసార పరీక్షా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సందర్శించారు. భూసార పరీక్ష ఫలితాలు ఎలా నమోదు చేస్తున్నారు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. కొత్త మిషన్లు, సామగ్రి, సంచార వాహనాన్ని ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. దీనిపై ఏడీఏ రోజాపుష్పలత సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. 'మీరు చెప్పండి జేడీగారూ' అనగా ఆమె కూడా నీళ్లు నమిలారు. ఈ క్రమంలో ఏవోలు కలెక్టర్‌కు సమాధానం ఇచ్చారు.

ఇలాగేనా నిర్వహించేది..?

ప్రయోగశాలలో నమూనాలకు స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంపై కలెక్టర్ మండిపడ్డారు. ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకున్నపుడు అది ఎవరిదనే దానిపై స్టిక్కర్ పెడతారని గుర్తు చేశారు. మట్టి నమూనాలన్నీ ఒకచోట ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న క్రిమిసంహార మందుల పరీక్షా కేంద్రంలో జరుగుతున్న పురుగు మందుల పరీక్షల గురించి తెలుసుకున్నారు. వాడి పడేసిన గాజు సీసాలు, ఇతరత్రా వ్యర్థాలు ఎక్కడికక్కడ ఉండటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డివిజన్ ఏడీఏ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.

అపార్ వేగవంతం చేయాలి

అనంతపురం అర్బన్: అపార్ జనరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ పొందేందుకు నాన్ అవైలబుల్ సర్టిఫికెట్ వీలైనంత త్వరగా మంజూరు చేయాలని డీపీఓని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి జూమ్ ద్వారా డీపీఓ, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, డీఎల్‌డీఓలు, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లకు సంబంధించిన ల్యాప్‌టాప్‌లు ఉప విద్యాశాఖ అధికారుల వద్ద భద్రపరిచిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. వీటిని అపార్ ఐడీ జనరేషన్ ప్రక్రియలో ఉపయోగించుకోవాలని చెప్పారు.

ఉపాధి లక్ష్యాలు పూర్తి చేయాలి

ఉపాధి పనుల విషయంలో అలసత్వ ధోరణి ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డ్వామా పీడీ, ఎంపీడీఓలు, ఏపీఓలు, ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జల్ సంచయ్–జన్ భాగీదారీ కార్యక్రమంలో గుంతకల్లు మండలం చాలా వెనుకబడి ఉందన్నారు. పల్లెవనాలు పథకానికి అనుమతులు పొంది పనులు చేపట్టాలన్నారు. ప్రతివారం జిల్లావ్యాప్తంగా 300 ఫారం పాండ్లు మొదలుపెట్టాలన్నారు. రాప్తాడు మండలంలో తక్షణం పనులు గుర్తించి కనీసం 10 పనులు ప్రారంభించాలన్నారు. కమ్యూనిటీ సోప్ పిట్‌లు 286 మంజూరు చేశామని, వారానికి కనీసం 50 పనులు ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. కుందుర్పి మండలంలో పనులు చాలా పెండింగ్ ఉన్నాయన్నారు. వ్యక్తిగత సోప్ పిట్ పనుల్లో శింగనమల వెనుకబడి ఉందన్నారు.

పలు మండలాల్లో వర్షం



అనంతపురం నగరంలో కురుస్తున్న వర్షం

అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడనం ప్రభావంతో గురువారం సాయంత్రం పలు మండలాల్లో వర్షం కురిసింది. గుంతకల్లు, తాడిపత్రి, నార్పల, అనంతపురం ప్రాంతాల్లో 30 మి.మీ వర్షపాతం నమోదైంది. పుట్లూరు, బుక్కరాయసముద్రం, బెళుగుప్ప, రాయదుర్గం, ఆత్మకూరులో 20 మి.మీ, వజ్రకరూరు, డీ హీరేహాళ్, శింగనమల, ఉరవకొండ, శెట్టూరు, రాప్తాడు, పామిడి, పెద్దపప్పూరు, కళ్యాణదుర్గం, యల్లనూరు, గార్లదిన్నె, గుత్తి మండలాల్లో 10 మి.మీ పైగా వర్షం కురిసింది. మరికొన్ని మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. భారీ ఉరుములతో అరగంట పాటు కురిసిన వర్షానికి అనంతపురం నగరం చిత్తడిగా మారింది.


జిల్లాకు వర్షసూచన..

బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న 3 రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 29.4–32.0, రాత్రి ఉష్ణోగ్రతలు 20.0–24.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 80–94, మధ్యాహ్నం 63–80 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

ఐడియా మెరిసింది..

వ్యాపారం అదిరింది





నిజాయితీగా బతకాలన్న ఆశ ఉండాలే కానీ ఎన్నో అవకాశాలు ఉంటాయని నిరూపిస్తున్నాడు అనంతపురం నందమూరినగర్‌కు చెందిన ఖాదర్. బైకునే ఆటో మాదిరి మార్చుకుని వివిధ రకాల వస్తువులతో ఇంటింటికెళ్లి వ్యాపారం చేస్తున్నాడు. ఇంటి ముంగిటకే అన్ని వస్తువులూ వస్తుండటంతో కొనడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఛిద్రమవుతున్న చిరుతలు

- ఏడాదిన్నరలో నాలుగు మృతి
- రోడ్డు ప్రమాదాల బారిన పడి మరణం
- అడవుల విస్తీర్ణం గణనీయంగా తగ్గుతుండటమే కారణం
- వన్య ప్రాణులకు ఉమ్మడి జిల్లాలో అనుకూల వాతావరణం



మడకశిర మండలం యారంగాపురం సమీపంలో వాహనం ఢీకొని మృతి చెందిన చిరుత (ఫైల్)



రొళ్ల మండలం బాజయ్యపాళ్యం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఎలుగు బంటి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుతల మరణాల ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. పిల్లి జాతికి చెందిన చిరుతుల వృద్ధికి అత్యంత అనుకూలమైన వాతావరణం ఉమ్మడి జిల్లాలో ఉంది. రెండు జిల్లాల పరిధిలో వేలాది హెక్టార్లలో విస్తరించి ఉన్న చిట్టడవులు ఎన్నో జంతుజాలాలకు ఆవాసంగా ఉన్నాయి. అలాంటి చోట చిరుతలు అకాల మృత్యువుకు గురవుతుండటం విస్మయం కలిగిస్తోంది. అడవులు క్షీణించి వివిధ రాష్ట్రాల్లో పులులు అంతరించి పోతుండగా.. ఉమ్మడి జిల్లాలో మాత్రం రోడ్డు ప్రమాదాలు, వేటగాళ్ల ఉచ్చులో ఇరుక్కుని చిరుతలు మృతి చెందుతుండటం గమనార్హం.

ఏడాదిన్నరలో నాలుగు..

గడిచిన 18 నెలల కాలంలో ఉమ్మడి జిల్లాలో నాలుగు చిరుత పులులు మృతి చెందాయి. 2023 ఆగస్టులో రెండు చిరుతలు శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో అనుమానాస్పదంగా మృతి చెందాయి. ఇది జరిగిన కొన్నాళ్లకే జిల్లాలో శెట్టూరు మండలం లక్ష్మంపల్లి వద్ద మరో చిరుత మృతి చెందింది. ఇటీవల మడకశిర నియోజకవర్గంలో రోడ్డు దాటుతున్న సమయంలో వాహనం ఢీకొనడంతో చిరుత కన్నుమూసింది.

మిగిలిన వన్యప్రాణులూ..

చిరుతల తర్వాత ఎలుగుబంట్లు, జింకలు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు వదులుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండ సమీపంలో 2023లో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టి జింక మృతి చెందింది. అదే ఏడాదిలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ఎలుగుబంటి చనిపోయింది. దీనికితోడు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని జింకలు, దుప్పులు ప్రాణాలు కోల్పోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వన్యప్రాణుల వివరాలు..	
అనంతపురం జిల్లాలో అటవీ విస్తీర్ణం	7.29 శాతం
శ్రీ సత్యసాయి జిల్లాలో అటవీ విస్తీర్ణం	13.94 శాతం
ఉమ్మడి జిల్లాలో చిరుత పులుల సంఖ్య	400కు పైగా
కృష్ణ జింకలు	3,000 వరకు
చుక్కల దుప్పులు	450 వరకు



చిరుతల మృతికి ప్రధాన కారణాలు..

- రాత్రి పూట ఆహారం వేటలో భాగంగా జాతీయ రహదారులపైకి రావడం, వాహనాల లైట్ల వెలుతురుకు దిక్కుతెలియక ప్రమాదానికి గురవడం
- రహదారుల పక్కన నీటిగుంట ఉండటంతో అక్కడికి వచ్చి రోడ్డు ప్రమాదంలో చిక్కుకోవడం
- చిరుతల గోళ్ల కోసం వేటాడుతున్న వేటగాళ్ల ఉచ్చులో ఇరుక్కోవడం
- అడవుల విస్తీర్ణం ఏటికేటికీ కుంచించుకుపోతుండటం
- పంట పొలాలకు రైతులు ఏర్పాటు చేసే కరెంటు ఫెన్సింగ్‌లకు తగలడం

క్లుప్తంగా

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జేసీ శివనారాయణశర్మ

అనంతపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అనంతపురంలోని కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, నగర పాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ వరకూ నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డిజిటల్ లైబ్రరీ, లెండింగ్ రూము, పిరియాడికల్ సెక్షన్, కాంపిటీషన్ సెక్షన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లికి చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి (31) ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం మిడుతూరు గ్రామ సమీపంలోని పొలాల్లో చేరుకున్న ఆయన పురుగుల మందు తాగి విషయాన్ని తన స్నేహితులకు, కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. వారు అక్కడకు చేరుకునే లోపు మృతి చెందాడు. కాగా, సునీల్‌కుమార్ రెడ్డి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ఎంటెక్, ఎంఫార్మసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాల, ఓటీపీఆర్‌ఐతో పాటు వైఎస్సార్ జిల్లా పులివెందులలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 16న స్పాట్ అడ్మిషన్లు చేపట్టానున్నారు. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి గురువారం వెల్లడించారు. ఏపీపీజీఈసెట్‌లో అర్హత సాధించి ఇప్పటి వరకూ ఎక్కడా అడ్మిషన్లు తీసుకోకుండా ఉండే విద్యార్థులు మాత్రమే అర్హులు. స్పాట్ అడ్మిషన్ల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్లను తీసుకుని ఈ నెల 16న జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావచ్చు. పూర్తి వివరాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఉత్సాహంగా... ఉల్లాసంగా

- 'సాక్షి' ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం
- దివ్యాంగులను ప్రోత్సహించడం అభినందనీయం : వక్తలు



వారంతా దివ్యాంగ చిన్నారులు. లోకం పోకడ తెలియని పసిపాపలు. అయినా ఎందులోనూ తాము తక్కువ కాదని నిరూపించారు. ఉల్లాసంగా... ఉత్సాహంగా... చాలా సంతోషంగా వివిధ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. గెలుపు కోసం తమ సర్వశక్తులూ ఒడ్డారు. చివరకు విజయం సాధించిన థ్రిల్‌తో ఉప్పొంగిపోయారు. 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని రామనగర్‌లో ఉన్న రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మానసిక వికలాంగుల పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం సందడిగా సాగింది.– అనంతపురం కల్చరల్:



బాలల దినోత్సవంలో పాల్గొన్న మానసిక దివ్యాంగులు, అనాథలు



బహుమతి అందుకుంటున్న చిన్నారి

విజేతలు వీరే...

జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగు పందెంలో నగేష్, లోకేశ్వర గౌడ్, భవ్యశ్రీ, మనస్విని, షాట్‌పుట్‌లో అజయ్‌గౌడ్, దుష్యంత్, చందన, స్లో వాక్‌లో దాదాపీర్, శబరీష్, రైమ్స్‌లో పవిత్ర, ప్రణవి, నాన్ వర్బల్ కమ్యూనికేషన్స్‌లో హరి యజ్ఞేష్, హరీష్, లాంగ్ జంప్‌లో అక్షయ్, అస్లాం, పిక్‌నిక్ బాస్కెట్ బాల్ పోటీల్లో మీషల్, శ్రీనివాస సాయిచరణ్ విజేతలుగా నిలిచారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా లేడీస్ క్లబ్ జోనల్ ప్రతినిధి షమీమ్ షఫీవుల్లా, ఆత్మీయ అతిథులుగా అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రియాజుద్దీన్ అహమ్మద్, సాక్షి టీవీ జిల్లా ఇన్‌చార్జ్ శివారెడ్డి, జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జ్ టి.మహేశ్వరరెడ్డి, రాస్ పాఠశాల హెచ్‌ఎం ఫర్హానా హాజరై, బహుమతులు ప్రదానం చేశారు. స్వీట్లు అందజేశారు.



స్లో వాక్ పోటీల్లో మానసిక దివ్యాంగులు



పరుగు పందెంలో పాల్గొన్న అనాథ చిన్నారులు



పిక్నిక్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడిన మానసిక దివ్యాంగ చిన్నారులు

దత్తత తీసుకుంటా...



నేను సాగిస్తున్న సేవా కార్యక్రమాలకు రాస్ సంస్థ వేదికగానే పునాదులు పడ్డాయి. మానసిక దివ్యాంగుల్లో ఉత్సాహం రేకెత్తిస్తూ 'సాక్షి' చేపట్టిన ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలతో మానసిక దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది. త్వరలో రాస్ సంస్థలోని అనాథ చిన్నారులను దత్తత తీసుకుని వారి బాగోగులు చూస్తా.

– తరిమెల రమణారెడ్డి, అమ్మ సంస్థ అధ్యక్షుడు

సాక్షి సంకల్పం అభినందనీయం



మానసిక వికలాంగులు, అనాథలను ప్రోత్సహించి వారిలో ఉత్సాహం నింపాలన్న ఆశయం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఇలాంటి ప్రయత్నం చేపట్టిన సాక్షి మీడియా సంకల్పం అభినందనీయం. సేవా భావంతో పనిచేస్తున్న రాస్ సంస్థకు మా వంతు సాయమందిస్తాం.

– షమీమ్ షఫీవుల్లా, లేడీస్ క్లబ్ జోనల్ ప్రతినిధి

సాక్షి స్ఫూర్తిదాయక సేవలు



సమాజంలో అన్యాయానికి గురైన వారి పక్షాన నిలిచి, వారి వేదనను ప్రపంచానికి తెలియజేయడంలో 'సాక్షి' అన్నింటా ముందంజలో ఉంది. ప్రతి అంశంపై స్పందిస్తూ స్ఫూర్తిదాయక కార్యక్రమాలనూ చేపడుతోంది. ఇందులో భాగంగా మానసిక వికలాంగుల మధ్య బాలల దినోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు 'సాక్షి' సిద్ధంగా ఉంది.

– రామచంద్రారెడ్డి, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్

నేటి నుంచి 'సంతోష్ ట్రోఫీ'

- విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: నేటి నుంచి ప్రారంభం కానున్న సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ–2024ను విజయవంతం చేయాలని, ఇందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంతోష్ ట్రోఫీ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు అనంత క్రీడాగ్రామం వేదికగా జరిగే టోర్నీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతపురంలో ఈ టోర్నీను నిర్వహించడం గర్వకారణమన్నారు. ఏపీఎఫ్ఏ ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్ మాట్లాడుతూ.. కొత్తతరం ఫుట్‌బాల్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచేందుకు అధికారులు, మీడియా ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. మరింత సమాచారానికి, మీడియా విచారణకు 99855 06638లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు వేణుమాధవ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సుధాకర్, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబాబు, అనంతపురం జిల్లా పీఆర్‌ఓ దీపక్ దయానంద్, డీఐపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి పాల్గొన్నారు. కాగా, ఈ టోర్నీలో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, అండమాన్ నికోబార్ జట్లు పాల్గొననున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభ మ్యాచ్‌లో ఆంధ్ర–కర్ణాటక జట్లు తలపడనున్నాయి. కార్యక్రమానికి ఆల్ ఇండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పాల్గొననున్నారు.

వీఏఏల పదోన్నతులు వివాదాస్పదం

- అన్యాయం చేశారంటున్న ఎస్సీ క్యాటగిరీ ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల (వీఏఏ)కు కల్పించిన పదోన్నతులు వివాదాస్పదంగా మారాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 26 వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) పోస్టుల భర్తీకి ఇటీవల ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో 60 శాతం సీనియార్టీ ప్రాతిపదికన రోస్టర్ల వారీగా పదోన్నతులు కల్పించాలని, మిగిలిన 40 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద భర్తీ చేయాలనే నిబంధనలు ఉన్నాయి. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా సచివాలయ వ్యవస్థ కింద 2019లో నియమితులైన వీఏఏల ద్వారా 60 శాతం అంటే 16 పోస్టులను సీనియార్టీ, ప్రతిభ, క్యాటగిరీ, రోస్టర్ విధానం ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఇందులోనూ మూడు పోస్టులు ఎస్సీ వర్గానికి చెందిన వీఏఏలకు కేటాయించాలి. అయితే ఎస్సీ వర్గానికి చెందిన వీఏఏల స్థానాల్లో ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారికి పదోన్నతి కల్పిస్తూ జాబితా విడుదల చేశారు. దీనిపై ఎస్సీ వర్గానికి చెందిన వీఏఏలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇదేమని అడిగితే... ఇప్పటికే పనిచేస్తున్న ఏఈఓల్లో 24 మంది వరకు ఎస్సీ వర్గానికి చెందిన వారున్నందున ఆ సామాజిక వర్గానికి కేటాయించిన 17 శాతం కోటా గతంలోనే పూర్తయిందని అధికారులు బుకాయించారు. ఎస్సీ కోటా ప్రకారం 19 అయితే... 24 పోస్టులు ఎలా ఇచ్చారనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. దీనిపై పలువురు ఎస్సీ వర్గానికి చెందిన వీఏఏలు వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులను, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో సిబ్బందిని కలసి తమ వాదనను గట్టిగా వినిపించారు. తమకు న్యాయం చేయాలని లేదంటే కోర్టుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కాగా, ఈ అంశం ఇప్పటికే కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో ఆయన కూడా వ్యవసాయశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: గత ఎన్నికల్లో 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా కల్పించకుండా కూటమి సర్కార్ కుట్రలు చేస్తోందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా అంశంపై హైకోర్టు జారీ చేసిన నోటీసులపై కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అసెంబ్లీ స్పీకర్ తీరును తప్పుబట్టారు. గతంలో ప్రతిపక్ష పార్టీ నేతగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో హుందాగా ప్రజా సమస్యలపై అప్పటి టీడీపీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారని గుర్తు చేశారు. తమ పార్టీకి చెందిన 24 మంది ఎమ్మెల్యేలను మభ్యపెట్టి చంద్రబాబు తన పార్టీలోకి చేర్చుకున్నా ఎక్కడా బెదరకుండా అత్యంత బాధ్యతయుతంగా ప్రజా సమస్యలపై పోరాడారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నారనే అక్కసుతో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాను అణచి వేయడమే లక్ష్యంగా కూటమి పెద్దలు దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సోషల్ మీడియా కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు సీఎం చంద్రబాబు, ఆయన బృందం స్వస్తి చెప్పకపోతే గట్టిగా బుద్ధి చెపుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, పార్టీ రూరల్ కన్వీనర్ సుంకన్న, మాజీ ఎంపీపీ చందా చంద్రమ్మ, ఏసీ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పామిడిలో చేపల వర్షం!



వర్షంతో పాటు పడిన చేపపిల్లలు

పామిడి: మండలం కేంద్రంలో గురువారం రాత్రి కురిసిన వర్షంలో చేప పిల్లలు భూమిపై పడ్డాయి. రోడ్డుపై ఎగిరి గంతేస్తున్న వీటిని జనం ఒడిసి పట్టుకుని నీళ్ల బకెట్లు, పాత్రల్లో వేశారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: ఎలాంటి అనుమతులు లేకుండా స్థానిక పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీఐ యుగంధర్ గురువారం సీజ్ చేసి, తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తికి అప్పగించారు. ఇందులో ప్రభుత్వ సీసీ రోడ్డు పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్ మేరకు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను వదిలేశారు. మిగిలిన మూడు ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించారు.

ప్రతి ఇంటా క్యాన్సర్ పరీక్షలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

శింగనమల: జిల్లాలో ప్రతి ఇంటా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ ఈబీ దేవి అన్నారు. గురువారం శింగనమల, కల్లుమడి గ్రామాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. శింగనమలలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో 18 సంవత్సరాలు పైబడిన వారికి నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌తో పాటు బీపీ, షుగర్, టీబీ, కుష్ఠు పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. రోజూ ఐదు గృహాలను సందర్శించి ఆహారపు అలవాట్లు, వ్యసనాలు తదితర వివరాలు తెలుసుకుని యాప్‌లో పొందుపరుస్తామన్నారు. ఈ కార్యక్రమం 6 నుంచి 9 నెలల పాటు సాగుతుందని వెల్లడించారు. మెడికల్ కళాశాల, స్విమ్స్ తిరుపతి, విశాఖపట్నంలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా ఎన్టీఆర్ ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ–సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్. శంకర నాయక్, డాక్టర్ తేజశ్విని, సూపర్ వైజర్లు గంగాధర, అశ్వత్థనారాయణ, హెల్త్ ప్రొవైడర్ దివ్యభారతి, ఆరోగ్య కార్యకర్తలు తిరుపాలమ్మ, నాగరాజు, బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

పదోన్నతుల్లో మున్సిపల్ టీచర్లకు అన్యాయం

అనంతపురం ఎడ్యుకేషన్: పదోన్నతుల్లో మున్సిపల్ టీచర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారంటూ యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూలు మేరకు ఈ నెల 6న ప్రధానోపాధ్యాయులు, 8న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు కల్పించాల్సి ఉందన్నారు. చాలా జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తి కాగా, ఉమ్మడి అనంత జిల్లాలో నేటికీ కనీసం తుది సీనియార్టీ జాబితా కూడా ప్రకటించలేదన్నారు. వెంటనే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను విడుదల చేయాలన్నారు. లేకుంటే 16న సాయంత్రం ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. 'అపార్' విషయంలోనూ తీవ్ర ఒత్తిడి పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలస్యానికి కారణమైన సాంకేతిక సమస్యలను పరిష్కరించకుండా టీచర్లపై ఒత్తిడి చేయడం సబబు కాదన్నారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, జిల్లా కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, కృష్ణకాంత్, చంద్రమోహన్, మహేష్, మహమ్మద్ గౌస్ ఉన్నారు.

ఓపీఎస్ సాధనే లక్ష్యం

- ద.మ.రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి శంకరరావు



ప్రసంగిస్తున్న శంకరరావు

గుంతకల్లు టౌన్: రైల్వే ఉద్యోగ, కార్మికుల పాలిట శాపంగా మారిన ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం సాధనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సమరశీల పోరాటాలు సాగిస్తామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి శంకరరావు అన్నారు. డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరగనున్న రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన డీజిల్ షెడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. రైల్వేలో సింగిల్ యూనియన్‌గా మజ్దూర్ యూనియన్‌ను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లి పాత పెన్షన్ విధానాన్ని సాధించి తీరుతామన్నారు. 8వ వేతన కమిటీ, ఎల్‌డీసీ పరీక్షలు, హార్డ్ అండ్ రిస్క్ అలవెన్సులను అన్ని విభాగాలకు వర్తించేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. యూనియన్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్, రైల్వే పెన్షనర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి మస్తాన్‌వలి, వివిధ బ్రాంచ్‌ల కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

ఆత్మకూరు: ఈ నెల 17న పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో జరిగే కోటి దీపోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణపై గురువారం పంపనూరు ఆలయంలో మండల స్థాయి అధికారులు, ఆలయ సిబ్బందితో ఆయన సమీక్షించారు. మరుగుదొడ్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తరాదన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎక్కడేగాని అపరిశుభ్రత ఉండరాదన్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు అసాంఘిక శక్తుల చర్యలను అడ్డుకునేలా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. కోటి దీపోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ బాబు, డీఎల్‌పీఓ సుమన జయంతి, డీఎల్‌డీఓ లలితాబాయి, ఎంపీడీఓ లక్ష్మీనరసింహులు, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ప్రధాన అర్చకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తితో అభివృద్ధికి బాటలు : జేసీ

అనంతపురం అగ్రికల్చర్: సహకార వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లోనూ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. గురువారం స్థానిక స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను జేసీ ప్రారంభించారు. డీసీసీబీ కార్యాలయంపై సహకార పతాకాన్ని ఆవిష్కరించి, సహకార ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 'వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన చర్చావేదికలో జేసీ మాట్లాడారు. అన్ని వర్గాలు, అన్ని రంగాలకు ఒక తాటిపైకి తీసుకురావడంలో ఈ వ్యవస్థ ప్రధానపాత్ర పోషించినట్లు తెలిపారు. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సహకార బ్యాంకులు, సొసైటీల ద్వారా రైతులు, అన్ని వర్గాలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి (డీసీవో) ఇ.అరుణకుమారి, డీసీసీబీ సీఈవో కే.సురేఖారాణి, డీఎల్‌సీవోలు, సహకార విద్యాధికారి, టౌన్ బ్యాంకు చైర్మన్ జీఎల్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్



మట్టితో బొమ్మల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు



పోటీలను పరిశీలిస్తున్న మాంఛో ఫెర్రర్



రంగోళి పోటీలో పాల్గొన్న బాలికలు

అనంతపురం: ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర స్థాయి బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆరు అంశాల్లో నిర్వహించిన పోటీలు ఆకట్టుకున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 37 ప్రాంతాలకు చెందిన 222 మంది విద్యార్థులు హాజరు కాగా, విజేతలకు ఆర్డీటీ మహిళాసాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహనమురళీ బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలతో విశాల ఫెర్రర్

క్లుప్తంగా

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోవాలి



స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎస్పీ జగదీష్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

అనంతపురం: ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచించారు. గురువారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జిల్లా పోలీసు శాఖ, ఆర్డీటీ సంస్థ సంయుక్తంగా పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. షికారీ పిల్లల అభివృద్ధికి తోడ్పడేలా 60 మంది షికారీ పిల్లలకు నాదల్ అకాడమీ తరఫున టెన్నిస్ కిట్లు, స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. షికారీ మహిళా గ్రూపులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. షికారీ కుటుంబాల అభివృద్ధికి కొందరు దాతలు రూ.65 వేలు ఆర్థిక సాయాన్ని ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛక్ష ఫెర్రర్, అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, మీనాక్షమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి



విద్యార్థి తల్లికి ప్రోగ్రెస్ కార్డ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో మంచిస్థాయికి ఎదగాలి. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని స్థానిక కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.రఘునాథరెడ్డి సూచించారు. గురువారం కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రోగ్రెస్‌పై చర్చించారు. ఇటీవల జరిగిన పరీక్షల్లో వారికి వచ్చిన మార్కులు, కళాశాల అటెండెన్స్ తదితర విషయాలను ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు వ్యక్తిగతంగా తెలియజేశారు. ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కళాశాలకు క్రమం తప్పకుండా హాజరై పాఠాలను క్షుణ్ణంగా వినాలన్నారు. రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

అనంతపురం రూరల్: సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పంచాయతీ అధికారులను జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు హెచ్చరించారు. రుద్రంపేట పంచాయతీలో తాగునీటి, వీధి దీపాలతో పాటు వివిధ సమస్యలు నెలకొన్నాయని పలువురు డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీపీఓ నాగరాజు నాయుడు గురువారం రుద్రంపేట పంచాయతీలో పర్యటించారు. పంచాయతీ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వీధి దీపాలు, తాగునీటి సమస్య పరిష్కారంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లాను ప్రశ్నించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

నీటి ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: పంపనూరులోని కొండపై వెలసిన మలహోబిలేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద గురువారం తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి ఎంపీడీఓ లక్ష్మీనరసింహ గురువారం భూమిపూజ చేశారు. రూ.10 లక్షలతో నీటి ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఏఈ శివకుమార్, టీడీపీ నాయకులు బాలాజీ, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్కార సభ

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్కార సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సత్కార సభకు కృపాకర్ మాదిగ, ఆర్.జే ప్రకాష్ మాదిగ వస్తున్నారన్నారు.

పేరు మార్చి.. నిధులు నిలిపేసి!



ఈ ఫొటోలో ఉన్న భవనాన్ని చూసి ఏ ప్రైవేట్ కళాశాల భవనం అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే. ఎందుకంటే ఈ భవనం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంది. ఈ భవనాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1.15 కోట్లతో అన్ని హంగులతో నిర్మించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

- 'మనబడి నాడు-నేడు'కు నిధులు ఆపిన కూటమి ప్రభుత్వం
- పాఠశాలల్లో ఆగిన భవన నిర్మాణాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు



హంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్లాబ్ వరకు పూర్తయిన తరగతి గదులు

రాప్తాడు: కూటమి ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన కుదరడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతూనే వాటికి నిధులను ఆపేసింది. దీంతో పాఠశాల భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్కారు బడుల్లో విద్యా సంస్కరణల్లో భాగంగా నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల భవన నిర్మాణాలకు గాను రెండు విడతలుగా రూ.కోట్ల నిధులను మంజూరు చేసి పనులు కొనసాగించింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మనబడి నాడు-నేడు కార్యక్రమం పేరును మన బడి- మన భవిష్యత్తుగా మార్చింది. అయితే కార్యక్రమానికి నిధులు విడుదల చేయకపోవడంతో దీంతో భవన నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. తరగతి గదుల కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అర్ధంతరంగా ఆగిన నిర్మాణాలు..

మండలంలో మొత్తం 36 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపుగా 3600 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు మొదటి విడతలో భాగంగా 14 పాఠశాలలను ఎంపిక చేసి రూ.4.93 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసింది. రెండో విడతలో భాగంగా 22 పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, మరమ్మతులకుగానూ రూ.6 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో కొన్ని భవనాలు పూర్తయ్యాయి. మరికొన్ని భవనాలు శ్లాబ్ దశలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో అసంపూర్తిగా మిగిలాయి. దీంతో అదనపు గదులు పూర్తికాక, తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువు కొనసాగించాల్సి వస్తోంది.



రెండో విడతలో రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిలిచిన తరగతి గదులు

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు లేక చెట్ల కింద, వరండాలో విద్యార్థులను కూర్చొపెట్టి బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొదటి విడతలో నాడు-నేడు పనులను పూర్తి చేశారు. రెండో విడత కూడా 60 శాతం పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలి.

– మన్నల రవికుమార్, ఎమ్మార్పీస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

నిధులు రాగానే పూర్తి చేస్తాం



మండలంలో పాఠశాలల నూతన భవన నిర్మాణాల పురోగతి గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు వేగవంతం చేస్తాం.

–మల్లికార్జున, ఎంఈఓ, రాప్తాడు

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

ఆత్మకూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఎం కమిటీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పథకాలు అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. నిత్యవసరాల సరుకుల ధరలు తగ్గించాలన్నారు. ముఖ్యంగా పిల్లలపై, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సూచించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు రామయ్య, రాజేశ్వరమ్మ, రాము, జయమ్మ, వలి, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు మాదిగల ఆత్మీయ సదస్సు

అనంతపురం టవర్‌క్లాక్: ఈనెల 16న లలిత కళాపరిషత్తులో మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన నాయకులను సన్మానించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేపటి నుంచి మండల పూజలు

అనంతపురం కల్చరల్: చెరువు కట్టపై వెలసిన అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం నుంచి మండల పూజలు జరగనున్నాయి. గురువారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతమ్ మాట్లాడారు. శబరిమల ప్రధాన పూజారి రాజీవ్‌తంత్రి మార్గదర్శనంలో నవంబర్ 16 నుంచి డిసెంబర్ 26 వరకు మండల పూజలు, అయ్యప్ప మాలధారులకు అన్నదానం జరుగుతుందని తెలిపారు. మాలధారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిసెంబర్ 5 నుంచి 10వ తేదీ వరకూ రాజీవ్‌తంత్రి శిష్యబృందం ఆధ్వర్యంలో ఆలయంలో ఉత్సవ పూజలు జరుగుతాయన్నారు.

విద్యార్థులను మోసం చేస్తున్న ప్రభుత్వం



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తోందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం స్థానిక శ్రీకంఠం సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 77 జీఓ రద్దు చేసి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా అడుగులు వేస్తామంటూ ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ప్రగల్భాలు పలికారన్నారు. ఈ రోజు మంత్రి నోరు మూగబోయిందా? అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సర బకాయిలను విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు నేరుగా జమ చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉండిపోతున్నాయని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉన్నత విద్యకు కేటాయింపులు చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యథావిధిగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి భరత్, నాయకులు సుధీర్, విజయ్, భూతరాజు, విజయ్ సాయి పాల్గొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

అనంతపురం కల్చరల్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాతూరు బీరప్ప స్వామి గుడిలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు కనకదాస సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. దీపోత్సవానికి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, పాతూరు విరూపాక్షేశ్వరాలయం, బాలయోగి ఆశ్రమం తదితర చోట్ల పెద్ద ఎత్తున జ్వాలాతోరణాలు, సామూహిక దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సహకార వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక టౌన్ బ్యాంక్‌లో గురువారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. చైర్మన్ జేఎల్ మురళీధర్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే, రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో డీసీఓ అరుణకుమారి ఆధ్వర్యంలో సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌తో గుగ్గిళ్ల జగదీశ్వర్ రెడ్డి



వైఎస్ జగన్‌ను కలిసిన బొంత జనార్దన్ రెడ్డి

రాప్తాడు: మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుగ్గిళ్లా జగదీశ్వర్ రెడ్డి, పాలచెర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంత జనార్దన్ రెడ్డి గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాజీ సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. మండలంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ నాయకులకు సూచించారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయరా?



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర ఉన్నత విద్యకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన రూ.3,480 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న విజయవాడలో చేపడుతున్న 'మహాధర్నా'ను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల పక్షాన గళం వినిపించడం కోసం విజయవాడలో మహాధర్నా చేపడుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించేందుకు సర్క్యులర్ జారీ చేశారన్నారు. పరీక్ష ఫీజు కట్టేందుకు కళాశాల దగ్గరికి వెళ్తే పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నారన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌పై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడలేదన్నారు. యువగళం పాదయాత్రలో అధికారంలోకి వస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పున: ప్రారంభిస్తామని చెప్పిన నారా లోకేష్.. తర్వాత పట్టించుకోలేదన్నారు. హామీలో భాగంగా జీఓ 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం 'తల్లికి వందనం' అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు భీమేష్, ఉపాధ్యక్షులు సోము, విజయ్, నాయకులు గణేష్, సాయి, పరమేష్, మహేష్ పాల్గొన్నారు.

మాట తప్పడం బాబుకు అలవాటే



మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు సావిత్రి

అనంతపురం రూరల్: నిత్యావసర ధరలు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వీ నాయుడు మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎన్నికల సమంయలో ఉచిత ఇసుక అందిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు ఇచ్చినమాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం అధికారంలోకి రాగానే హామీలను విస్మరించడం సీఎం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశానంటుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకుండా సామాన్యుల నడ్డి విరుస్తున్నాయన్నారు. అంతర్జాతీయంగా డీజిల్, పెట్రోల్ తగ్గినప్పటికీ దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెరురుగుతూనే ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నా పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మహిళలు, దళితులు, బాలికలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ మంత్రులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సావిత్రమ్మ, నాయకులు గోపాల్, నాగరాజు, ప్రకాష్, వలి, నూరుల్లా తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. చిట్టి తల్లీ



చెత్తకుండీలో లభ్యమైన శిశువు మృతదేహం

అనంతపురం: సృష్టికి మూలం ఆదిశక్తి అంటారు. కానీ, ఆదిశక్తికి మూలమైన ఆడపిల్ల జన్మించి... జీవించే హక్కు లేకుండా పోతోంది. ఆడపిల్ల భారం అనుకున్న కొందరు పుట్టిన వెంటనే ఆ పసికందును చెత్త కుండీల్లో పడేస్తున్నారు. అనంతపురంలోని సర్వజనాస్పత్రి సమీపంలోని అరవిందనగర్ పార్క్ వద్ద గురువారం ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. చెత్త కుండీలో మృత శిశువును చూసిన స్థానికుల సమాచారం మేరకు రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యం

చెన్నేకొత్తపల్లి: టింబక్టు కలెక్టివ్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తోందని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ కార్యాలయం ఆవరణలో గురువారం 35వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా జన జాగృతి సంస్థ ప్రతినిధి బలరాం, రెడ్స్ ప్రతినిధి భానుజా, రైడ్స్ ప్రతినిధి కిష్టప్ప హాజరై, మాట్లాడారు. నవంబర్ 14, 1990 సంవత్సరంలో టింబక్టు కలెక్టివ్ సంస్థ రిజిస్టర్ అయిందన్నారు. అప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, పిల్లలు, యువత, చిన్న, సన్నకారు రైతులు, కూలీలు, వికలాంగులు, కళాకారులు తదితర వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. ఇప్పటి వరకూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలు సంపాదించినట్లు కొనియాడారు. అంతకుముందు బాలల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యం, కోలాటం, చెక్కభజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బబ్లూ గంగూలీ, సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య శాకమూరి, వివిధ మండలాల మహిళలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

చెన్నేకొత్తపల్లి: మతిస్థిమితం లేని వృద్ధురాలిని పోలీసులు చేరదీశారు. వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. కొన్ని రోజులుగా ఓ మతిస్థిమితం లేని వృద్ధురాలు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం వద్దనే ఉండేది. ఎవరైనా ఇస్తే తింటూ లేకపోతే అలాగే ఉండేది. ఈ విషయాన్ని తెలుసుకున్న చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ గురువారం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. వివరాల కోసం ఆరా తీయగా.. ఆమెకు మతిస్థిమితం లేదని నిర్ధారించారు. కుమార్తె సుబ్బరాయనిపల్లి గ్రామంలో ఉందని పోలీసులకు తెలిపింది. వెంటనే స్పందించిన ఎస్ఐ.. ఆమెను కారులో తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వృద్ధురాలిని జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు.



సందడిగా బాలల దినోత్సవం



జేఎన్‌టీయూ(ఏ)లో నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు



శ్రీచైతన్య పాఠశాలలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



ఆత్మకూరు: నెహ్రూ వేషధారణలో చిన్నారులు



'మాంటిస్సోరి'లో వివిధ వేషధారణలో విద్యార్థులు

అనంతపురం/అనంతపురం ఎడ్యుకేషన్/ఆత్మకూరు/రాప్తాడు: దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని గురువారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రంథాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్‌లో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఓఎస్డీ-2 వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, వర్సిటీ డైరెక్టర్లు తదితరులు నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించారు. సంగమేష్ నగర్, గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి విద్యా సంస్థల్లో కరస్పాండెంట్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జరుపుకున్నారు. అశోక్ నగర్‌లోని మినర్వా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నెహ్రూ వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఏజీఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ప్రిన్సిపల్ తబస్సుమ్ తదితరులు బహుమతులు అందజేశారు. ఇక ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లోని అంగన్‌వాడీలు, పాఠశాలల్లో చాచా నెహ్రూ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. జాతీయ నాయకుల వేషధారణలో పలువురు చిన్నారులు అలరించారు.